సాక్షి
బాపట్ల
ఆదివారం ၊ 2 ၊ జూలై ၊ 2023



మల్లేశ్వరుని సేవలో హైకోర్టు జడ్జి

పెదకాకాని: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత శనివారం భ్రమరాంబ మల్లేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.



శనిత్రయోదశి ప్రత్యేక పూజలు

అమరావతి: అమరావతి అమరేశ్వరాలయంలో శనిత్రయోదశి సందర్భంగా శనివారం శనీశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కార్డుదారులకు గోధుమ పిండి

గుంటూరు వెస్ట్: ప్రజల ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం బలవర్ధకమైన గోధుమ పిండిని కిలో రూ.16కి అందిస్తుందని జేసీ జి.రాజకుమారి శనివారం తెలిపారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి కృష్ణానదిలో చేపల వేట నిషేధం

అమరావతి: జిల్లా మత్స్యశాఖాధికారి ఆదేశాల మేరకు నేటి నుంచి మండలంలోని కృష్ణానది పరివాహక గ్రామాలలో నదిలో చేపలవేటపై నిషేధం విధించినట్లు మండల మత్స్యశాఖ పర్యవేక్షకురాలు జి.భాగ్యలత తెలిపారు శనివారం ఆమె మాట్లాడుతూ నదిలో జులై 1వతేదీ నుంచి ఆగస్టు 31వరకు రెండు నెలల కాలం మత్స్య సంపద అభివృద్ధికి, చేపల సంతానోత్పత్తికి అనువైన కాలం కావటంతో వేట నిషేధించామన్నారు. మత్స్యశాఖ సహాయకులు డి.శ్రీనివాసరావు, పి.శివకుమారిల ఆధ్వర్యంలో నిత్యం నిఘా ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపలవేటకు వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జిల్లావ్యాప్తంగా 85.71 శాతం పంపిణీ

బాపట్ల అర్బన్: బాపట్ల జిల్లా వ్యాప్తంగా శనివారం వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ 85.71శాతంగా నమోదైంది. జిల్లాలో మొత్తం 2,25,365 మంది పెన్షన్ దారులు ఉన్నారు. వీరిలో 1,93,169 మంది జూలై నెల మొదటి రోజునే పెన్షన్లు తీసుకున్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.600, గరిష్ఠ ధర రూ.1200, మోడల్ ధర రూ.800 వరకు పలికింది.

వైఎస్సార్ ఉచిత పంటల బీమా విడుదల

గుంటూరు జిల్లాలో 14,542 మంది రైతులకు రూ.4.16 కోట్లు

కొరిటెపాడు(గుంటూరు): వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 2022 ఖరీఫ్‌కు రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు జిల్లాలోని 14,542 మంది రైతులకు రూ.4.16 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గుంటూరు జిల్లాకు సంబంధించి వర్షాధారం కింద పత్తి పంట సాగు చేసిన ప్రత్తిపాడు, ఫిరంగిపురం, మేడికొండూరు, చేబ్రోలు, కాకుమాను మండలాలకు చెందిన 14,542 మంది రైతులు 25,877.62 ఎకరాల్లో పంట నష్టపోయారు. ఈ రైతులు వాతావరణ ఆధారిత బీమా పొందడానికి అర్హులుగా గుర్తించి జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాలు ఈ నెల 4వ తేదీవరకు ఆర్బీకేలలో ప్రదర్శిస్తారు. సామాజిక తనిఖీ చేపట్టి రైతుల నుంచి అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించి 4వ తేదీ సాయంత్రం లోపు ఆన్‌లైన్ చేస్తామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేసేందుకు విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో డీఈఓ పి.శైలజ పర్యవేక్షణలో జరిగిన ఈ ప్రక్రియలో హెచ్‌ఎం పోస్టులకు 140 మంది స్కూల్ అసిస్టెంట్లతో పాటు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 280 మంది చొప్పున తరలివచ్చారు. ఆదివారం స్కూల్ అసిస్టెంట్స్ బయాలాజికల్ సైన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్ పోస్టులకు సీనియార్టీ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని డీఈఓ తెలిపారు.

'రాయి'ల్టీ అక్రమాలకు చెక్!

- **శ్లాబ్ విధానంలోకి గ్రానైట్ పరిశ్రమలు**
- రాయల్టీ, జీఎస్టీలు చెల్లించకుండా అక్రమంగా రాయి తరలింపు
- బ్లేడ్, మల్టీబ్లేడ్ లెక్కలు తేలుస్తున్న మైనింగ్ అధికారులు
- అక్రమ ఎగుమతులు అడ్డుకునే లక్ష్యం
- జిల్లాలో 500 గ్రానైట్ పరిశ్రమలు



మార్టూరు సమీపంలోని ఓ గ్రానైట్ పరిశ్రమ

సాక్షి ప్రతినిధి, బాపట్ల: గ్రానైట్ ఎగుమతుల్లో అక్రమాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతోందన్న ఆరోపణల నేపథ్యంలో అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. దీనికోసం మొదట జిల్లాలో ఉన్న గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్లను శ్లాబ్ పరిధిలోకి తీసుకువచ్చేందుకు కసరత్తు వేగవంతం చేసింది. జిల్లాలోని మార్టూరు, బల్లికురవ, సంతమాగులూరు ప్రాంతాల్లో 500 వరకు గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో చాలా పరిశ్రమలకు మల్టీబ్లేడ్‌లు ఉన్నా, ఒక బ్లేడు చూపించి కటింగ్, పాలిషింగ్‌కు సంబంధించి రాయల్టీ, జీఎస్టీలు చెల్లించకుండా అక్రమంగా రాయిని తరలిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా తెలంగాణతోపాటు చెన్నై, కాకినాడ, కృష్ణపట్నం పోర్టుల నుంచి గ్రానైట్ రాయిని విదేశాలకు ఎగుమతి చేస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నట్లు సమాచారం. కొందరు ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న నేపథ్యంలో అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

బ్లేడ్‌ల ఆధారంగా పన్నులు..

శ్లాబ్ విధానంలోకి గ్రానైట్ పరిశ్రమలను తీసుకురావాలని నిర్ణయించిన అధికారులు ఒక బ్లేడు ఉన్న సంస్థ నెలకు రూ.22 వేలు, మల్టీ బ్లేడ్ సంస్థ రూ. 27 వేలు పన్నులు చెల్లించాలని నిర్దేశించారు. ఒక్కో బ్లేడ్‌కు 22 క్యూబిక్ మీటర్ల ముడిరాయిని తెచ్చుకోవచ్చు. రాయిని కటింగ్, పాలిషింగ్ చేసి నేరుగా ఎగుమతి చేసుకోవచ్చు. ఈ తరహాలో అన్ని పరిశ్రమలను శ్లాబ్ సిస్టం కిందకు తీసుకువస్తే నిబంధనల మేరకు సక్రమంగా రాయిని తెచ్చుకొని ఎగుమతులు చేసుకోవచ్చు. ఈ పద్ధతిలో అక్రమాలు జరిగే అవకాశం తక్కువ.

220 పరిశ్రమలు శ్లాబ్‌లోకి..

ఇటీవల కాలంలో 220 పరిశ్రమలను శ్లాబ్ సిస్టమ్ పరిధిలోకి అధికారులు తీసుకువచ్చారు. మరో మూడు నెలల్లో మిగిలిన పరిశ్రమలను ఈ విధానంలోకి మార్చనున్నారు. మరోవైపు అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అధికారులు కఠిన చర్యలకు దిగుతున్నారు. మైనింగ్, విజిలెన్స్ అధికారులు నిత్యం తనిఖీలు చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడే పరిశ్రమల యజమానులను ఇప్పటికే హెచ్చరించారు. అక్రమరవాణాతో పట్టుబడితే పెద్ద మొత్తంలో జరిమానాలు విధిస్తున్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు



జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాం. మా విభాగంతోపాటు విజిలెన్స్ విభాగం నిత్యం నిఘాపెట్టి ఉంది. అక్రమ రవాణా జరిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవు. పట్టుబడితే పెద్దమొత్తంలో జరిమానాలు విధిస్తున్నాం. గ్రానైట్ పరిశ్రమలను రాబోయే మూడు నెలల్లో పూర్తిస్థాయిలో శ్లాబ్ విధానం కిందకు తీసుకువస్తాం.

– ఆర్.రాజేష్, జిల్లా మైనింగ్ అధికారి



పెనుమర్రు గ్రామ సచివాలయంలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

అర్హులందరికీ లబ్ధి జగనన్న సురక్ష లక్ష్యం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున

పెనుమర్రు(వేమూరు): అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారులకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. వేమూరు మండలంలోని పెనుమర్రు గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేమూరు మండలంలోని పెనుమర్రు, చంపాడు గ్రామాల్లో జగనన్న సురక్ష సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ సర్టిఫికెట్లు, ఆధార్ ఫోన్ నెంబరు లింక్, రేషన్ కార్డు సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు అవినీతి లేకుండా నేరుగా లబ్ధిదారులకే అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ నెల 1వ తేదీ నుంచి 30 వరకు నియోజక వర్గంలోని ప్రతి గ్రామ సచివాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ బొంత అర్జునరావు, గ్రామ సర్పంచ్ కొక్కిలగడ్డ సుమతి, పిల్లి సామ్రాజ్యం, జడ్పీటీసీ గాజుల హేమలత, ఎంపీటీసీ లక్ష్మీ నాగరాజ కుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన భవనం ప్రారంభం

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సహాయంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉండాలని మాజీ మంత్రి కాసు వెంకటకృష్ణారెడ్డి ఆకాంక్షించారు. పట్టణంలోని పెద్దచెరువులో సుమారు రూ.1.30కోట్ల వ్యయంతో నిర్మించిన ఐఎంఏ నూతన భవనాన్ని ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాసు మహేష్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్‌లతో కలిసి మాజీ మంత్రి కాసు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఏఏవీ రామలింగారెడ్డి అధ్యక్షత నిర్వహించిన సభలో మాజీ మంత్రి కాసు మాటాడారు. జిల్లా కలెక్టర్ శివశంకర్, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, కాసు మహేష్, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కాసు, కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి, కాసు

ఐఎఫ్‌ఎస్ ఫలితాల్లో బాపట్ల విద్యార్థికి ప్రథమ ర్యాంకు



కొల్లూరు వెంకట శ్రీకాంత్

బాపట్ల: యూపీఎస్సీ నిర్వహించిన ఇండియన్ ఫారెస్టు సర్వీసు(ఐఎఫ్‌ఎస్) ఫలితాల్లో బాపట్లకు చెందిన కొల్లూరు వెంకట శ్రీకాంత్‌కు ప్రథమ ర్యాంకు లభించింది. బాపట్లలోని శ్రీనివాసనగర్‌కు చెందిన శ్రీకాంత్ తండ్రి వెంకట రమణ ఎస్‌బీఐలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. తల్లి సువర్ణ గృహిణి కాగా శ్రీకాంత్ సోదరుడు శ్రీనివాస్ కూడా గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. శ్రీకాంత్ ఒకటి నుంచి 4వతరగతి వరకు బాపట్ల పబ్లిక్ స్కూలులో, 5,6 తరగతులు తణుకు భాష్యంలో, 7,8 బాపట్లలోని పబ్లిక్ స్కూలులో, 9,10గుంటూరులోని నారాయణలో, ఇంటర్ విజ్ఞాన్‌లో చదివారు. శివనాధన్ విశ్వవిద్యాలయంలో ఎలక్ట్రికల్ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తి చేసుకుని ఐఎఫ్‌ఎస్‌కు పోటీపడ్డారు. రెండోప్రయత్నంలోనే మొదటి ర్యాంకు సాధించారు. బాపట్ల విద్యార్థికి ఫస్ట్ ర్యాంకు రావటంతో పలువురు అభినందనలు తెలిపారు.

సేవలకు 'వంద'నం

- సమస్యలు వందశాతం తీరాలన్నదే 'జగనన్న సురక్ష' లక్ష్యం
- కలెక్టర్ రంజిత్ బాషా

అద్దంకి: అర్హులందరికీ వంద శాతం పథకాలు అందాలన్నదే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని బాపట్ల కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. పట్టణంలోని కాకానిపాలెంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పేదలకు 99 శాతం పథకాలను అందించిందన్నారు. ఆ ఒక్క శాతం మందికి కూడా అందించాలనే ఉద్దేశంతో, అర్హత ఉండీ పథకాలు అందని వారి వద్దకు వెళ్లి అర్జీలు తీసుకుని ఆయా ఫలాలను వారికి అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారన్నారు. రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాచిన కృష్ణ చైతన్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన హామీలన్నీ నెరవేర్చే విధంగా పారదర్శకంగా పాలన అందిస్తోందన్నారు. 11రకాల సర్టిఫికెట్ల కోసం, అదేవిధంగా అర్హత ఉండి పథకాలు అందని వారు వారి గ్రామాల్లో కార్యక్రమం జరిగే రోజున అర్జీలు అందజేయాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, కె.అనంతలక్ష్మి, కాకాని రాధాకృష్ణమూర్తి, అద్దంకి నియోజకవర్గ ప్రత్యేకాధికారి శంకర్ నాయక్, చీరాల రెవెన్యూ అధికారి సరోజిని, తహసీల్దార్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

ఏసీబీ వలలో గ్రామ సర్వేయర్

రైతు నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

వేమూరు: రైతు వద్ద నుంచి లంచం తీసుకుంటుండగా గ్రామ సచివాలయం సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు శనివారం పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ప్రతాప్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెరవలి గ్రామానికి చెందిన జువాది వెంకటేశ్వరరావు తన తల్లి కమలమ్మకు చెందిన 1.37 ఎకరాల పొలాన్ని ఆన్‌లైన్ చేసేందుకు సర్వే కోసం పెరవలి గ్రామ సచివాలయంలో ఇటీవల దరఖాస్తు పెట్టుకున్నాడు. గ్రామ సచివాలయం సర్వేయర్ షేక్ షబ్బీర్ పొలం సర్వే చేసి 1.13 ఎకరాల భూమికి సర్వే సర్టిఫికెట్ ఇచ్చాడు. మిగిలిన 24 సెంట్ల భూమి గురించి అడితే రూ.4500 లంచం ఇస్తేనే చేస్తానని సర్వేయర్ షబ్బీర్ తేల్చిచెప్పాడు. దీంతో చేసేదేమి లేక వెంకటేశ్వరరావు ఏసీబీ అధికారులను గత నెల 28న ఆశ్రయించాడు. రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు వెంకటేశ్వరరావు చేత గ్రామ సర్వేయర్‌కు రూ.4500 స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఇప్పించారు. డబ్బులు తీసుకున్న వెంటనే సర్వేయర్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దాడిలో డీఎస్పీ సత్యనందం, సీఐలు నాగరాజు, రాంబాబు, మన్మథరావు, లక్ష్మారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఏసీబీ దాడిలో పట్టుబడ్డ సర్వేయర్ షబ్బీర్

భగవతీ శాకంబరీ..

- ఇంద్రకీలాద్రిపై శాకంబరీ ఉత్సవాలు ప్రారంభం
- దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): కమలాసనంపై కూర్చుని తన పిడికిలిలో వరిమొలకలను పట్టుకుని, పుష్పాలు, ఫలాలు, దుంపగడ్డలు ధరించిన శాకంబరీదేవిగా విశేష అలంకారంలో.. ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్న భక్తజనం మది పులకించింది. ప్రకృతిమాతా ప్రణామం అంటూ అశేష భక్తజనం శాకంబరీదేవి అలంకారంలో ఉన్న జగజ్జననిని వేడుకున్నారు. భక్తులతో క్యూలైన్లు ఆధ్యాత్మిక తరంగాలయ్యాయి. ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శనివారం శాకంబరీదేవి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇవి మూడు రోజులపాటు జరగనున్నాయి. కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడుతో పాటు తెలంగాణాలోని పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు శాకంబరీదేవిని దర్శనానికి ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. ఉత్సవాల్లో తొలి రోజు శనివారం సుమారు 70వేల మంది దర్శనానికి వచ్చారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

కలశస్థాపనతో ప్రారంభమైన ఉత్సవాలు

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయం సమీపంలోని యాగశాలలో కలశ స్థాపనతో ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. శాకంబరీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తుల ఇంట అన్నపానీయాలకు లోటు లేకుండా ఉంటుందని ఆలయ అర్చకులు పేర్కొన్నారు. అమ్మవారిని వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలు, పండ్లతో అలంకరించారు. ఆలయ ప్రాంగణాన్ని కాయగూరలతో ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ, వైదిక కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించగా, పలువురు పాలక వర్గ సభ్యులు కట్టా సత్తెయ్య, చింకా శ్రీనివాసరావు, బచ్చు మాధవీకృష్ణ, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్‌శర్మ, వేద పండితులు, వైదిక కమిటీ సభ్యులు, ఎఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చగా ఆలయ ప్రాంగణం

ఉత్సవాలు పురస్కరించుకుని అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని కరివేపాకుతో కప్పేశారు. దీంతో అమ్మవారి ఆలయం కరివేపాకు తోటను తలపించింది. భక్తులు పచ్చదనం పరిమళాలతో పులకించారు. వంకాయలు, టమాటా, పొట్లకాయలను ఉపయోగించి చేసిన శివపార్వతుల ప్రతిమ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



పచ్చని పరిమళాలు.. అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు



భక్తానందవిధాయిని.. శాకంబరీదేవికి హారతి

రికార్డు స్థాయిలో భక్తజనం

శాకంబరీదేవి ఉత్సవాలు, ఆషాఢ మాసోత్సవాలు, శనివారం నేపథ్యంలో రికార్డు స్థాయిలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం సుమారు 60 నుంచి 70 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆదివారం కూడా ఇదే స్థాయిలో భక్తుల రద్దీ ఉంటుందని ఆలయ అధికారులు భావిస్తున్నారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవ మూర్తిని వివిధ రకాల కాయగూరలు, ఆకుకూరలు, పండ్లతో అలకంరించారు.

అద్భుతం.. కదంబం..

శాకంబరీ ఉత్సవాల్లో అలంకరణ చేసిన కూరగాయలతో తయారు చేసే కదంబ ప్రసాదానికి ప్రత్యేకత ఉంది. ఉత్సవాలకు విచ్చేసే భక్తులు అమ్మవారి దర్శనం తర్వాత అడిగేది.. కదంబ ప్రసాదం పంపిణీ ఎక్కడ అనేదే. పలు రకాల కాయగూరలు, ఆకుకూరలతో తయారు చేసే కదంబం ప్రసాదం కోసం భక్తులు బారులు తీరారు. ఈ ప్రసాదాన్ని ఆలయ ఈవో భ్రమరాంబ భక్తులకు పంపిణీ చేశారు.

అడవులను సంరక్షించుకోవాలి

డీఎఫ్‌వో రామచంద్రరావు


అడవుల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తున్న డీఎఫ్‌ఓ రామచంద్రరావు

నరసరావుపేట రూరల్: మొక్కలు నాటి అడవులను సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని జిల్లా అటవీ శాఖ అధికారి ఎన్.రామచంద్రరావు తెలిపారు. మండలంలోని యల్లమంద జెడ్పీ హైస్కూలులో అటవీ రక్షణ, వన్యప్రాణి సంరక్షణపై అవగాహనలో భాగంగా పల్నాడు ప్రకృతి పాఠాలు కార్యక్రమాన్ని అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామచంద్రరావు మాట్లాడుతూ భూమి ఉపరితలం మీద 9.4శాతం అడవులు ఆక్రమించి ఉన్నాయని తెలిపారు. వాతావరణంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు అడవులు దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వన్యప్రాణులను హింసించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. వన్యప్రాణులకు హాని కలిగించిన వారికి పడే శిక్షలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రమేష్‌బాబు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జ్యోతికిరణ్, డీఈవో రాము, పాఠశాల ఉపాధ్యాయులు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో అందరికీ మేలు

ఎంపీ మోపిదేవి


సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీ మోపిదేవి, జేసీ శ్రీధర్‌బాబు, నాయకులు

చెరుకుపల్లి: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమం అందించాలన్న కృత నిశ్చయంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని ఆరేపల్లిలో తహసీల్దార్ బి. వెంకటేశ్వర్లు, కుంచాలవారిపాలెంలో ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఆరేపల్లి సచివాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు, జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో కుల, మత, పార్టీలకు అతీతంగా, వివక్షతకు తావు లేకుండా నూటికి నూరు శాతం సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించేందుకే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. గత ప్రభుత్వంలో ఏ ఒక్క పత్రం కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రోజులు తరబడి తిరగాల్సి వచ్చేదన్నారు. దళారులకు లంచాలు చెల్లించాల్సి వచ్చేదన్నారు. ఒక్క రూపాయి చెల్లించకుండా, ఒక్క రోజులోనే ఇంతమందికి ధ్రువపత్రాల్ని దేశ చరిత్రలో అందించిన ఒకే ఒక ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ఇతర రాష్ట్రాల అధికారులు, నాయకులు సైతం అధ్యయనం చేసేందుకు ఆంధ్రా వైపు చూస్తున్నారని మోపిదేవి తెలిపారు. జాయింట్ కలెక్టర్ శ్రీధర్‌బాబు మాట్లాబుతూ కుంచాల వారిపాలెం, ఆరేపల్లి గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది 1502 ఇళ్లు సర్వే చేశారన్నారు. ఇందులో అర్హులైన 463మందికి వివిధ ధ్రువపత్రాల్ని అందించామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పైనం ఏడుకొండల రెడ్డి, సర్పంచులు మొగలిపువ్వు కోటేశ్వరరావు, కుంచాల స్వామిరెడ్డి, మండల ప్రత్యేక అధికారులు లక్ష్మి, సుధాకర్, ఈవోపీఆర్డీ మురళి, నాయకులు బండారు రామారావు, తూము కోటేశ్వరరావు మొగలిపువ్వు శ్రీనివాసరావు, తురిమెళ్ల శ్రీధర్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

మార్టూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతిపై శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్‌ఐ కె. కమలాకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇంకొల్లు మండలం సూదివారిపాలెం గ్రామానికి చెందిన శీలం రాజాబాబు (37) శుక్రవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై ద్రోణాదుల నుంచి స్వగ్రామం వెళుతూ అదుపు తప్పి కింద పడిపోయాడు. ప్రమాదంలో తల రోడ్డు పక్కన ఉన్న మైలురాయిని బలంగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని సోదరుడు ఫిర్యాదుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లైంగిక దాడి కేసులో వ్యక్తికి జైలు

చినగంజాం: ఓ మహిళపై లైంగిక దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి జైలుకు పంపిన సంఘటన చినగంజాం పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కె. సురేష్ అందించిన సమాచారం ప్రకారం.. మండలంలోని పెదగంజాం గ్రామానికి చెందిన ఓ మహిళకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడిన కట్టింపూడి రాజేష్‌ను ఇంకొల్లు సీఐ వి. సూర్యనారాయణ శనివారం అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టుకు హాజరుపరచగా ఒంగోలు జైలుకు తరలించారు.

రెండు గ్రామాల్లో ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటన

నడింపాలెం (ప్రత్తిపాడు): మండల పరిధిలోని రెండు గ్రామాల్లో శనివారం పన్నెండు మందితో కూడిన ట్రైనీ కలెక్టర్ల బృందం పర్యటించింది. శిక్షణలో భాగంగా తొలుత నడింపాలెం పంచాయతీలోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటరును పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి ఖాజాతో పాటు గ్రీన్ అంబాసిడర్లు మస్తానమ్మ, అంజమ్మతో మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్తల సేకరణ, వర్మీ కంపోస్టు ఎరువుల తయారీ, చెత్త నుంచి సంపద సృష్టి, ఇంటింటికీ చెత్త సేకరణలో ప్రజల భాగస్వామ్యం గురించి తెలుసుకున్నారు. అనంతరం నిమ్మగడ్డవారిపాలెంలో అమృత్ సరోవర్ పథకం కింద అభివృద్ధి చేసిన రక్షిత మంచినీటి చెరువును పరిశీలించారు. చెరువు అభివృద్ధికి తీసుకున్న చర్యలను డ్వామా జాయింట్ కమిషనర్ శివ ప్రసాద్ కలెక్టర్ల బృందానికి వివరించారు. అనంతరం ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ కార్యాలయాన్ని పరిశీలించారు. పథకాల అమలు, చేపట్టే పనులు, చెల్లించే బిల్లులు, ఉపాధి కూలీల వేతనం వంటి సమగ్ర వివరాల్ని పీడీ యుగంధర్ ట్రైనీ కలెక్టర్లకు తెలిపారు. వెంట పంచాయతీరాజ్ అడిషనల్ కమిషనర్ సుధాకర్, డీపీవో ఆర్. కేశవరెడ్డి, డిస్ట్రిక్ట్ పంచాయతీరాజ్ రిసోర్స్ సెంటర్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ పద్మాకర్ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీరమ్య తదితరులున్నారు.

పసుపు రైతులకు మద్దతు ధర కల్పించేందుకు కృషి

ఏపీ మార్క్‌ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కరుణశ్రీ


కొనుగోలు కేంద్రంలో పసుపు నాణ్యతను పరిశీలిస్తున్న కరుణశ్రీ

భట్టిప్రోలు: పసుపు రైతుల శ్రేయస్సు దృష్టిలో ఉంచుకుని, కనీస మద్దతు ధర కల్పించాలనే లక్ష్యంతో మార్కెట్ ధర కంటే మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటా రూ. 6,850 ధర కల్పిస్తూ వారిని ఆదుకుంటున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ కరుణశ్రీ పేర్కొన్నారు. భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పసుపు కొనుగోలు కేంద్రాన్ని ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో క్వింటా రూ. 4,500 నుంచి రూ. 5 వేలు ఉండగా ప్రభుత్వం మద్దతు ధర రూ.6,850 కల్పించిందని తెలిపారు.నాలుగు సంవత్సరాలుగా రైతుల నుంచి ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పసుపు, మొక్కజొన్న, శనగల్ని మద్దతు ధరకు కొనుగోలు చేస్తునట్లు చెప్పారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకేల ద్వారా వ్యవసాయ సంబంధిత సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తునట్లు తెలిపారు. గత నెల 5న ప్రారంభించిన ఈ కొనుగోలు కేంద్రం ఈ నెల 5వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. ఇప్పటిదాకా 80 టన్నులు పసుపు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. గ్రేడ్ ఎ-1 రకం పసుపును మాత్రమే కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. వారం పది రోజుల్లోగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. ఆమె వెంట జీడీసీఎంఎస్ మండల డీఈవో ఎం.మణితేజ, క్వాలిటీ ఎసైనర్ శివాజీ, జాకీర్ హుస్సేన్, రైతులు ఉన్నారు.

చంద్రబాబువి నీచ రాజకీయాలు

ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: ప్రతిపక్ష నేత నారా చంద్రబాబువన్నీ నీచ రాజకీయాలేనని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ పోతుల సునీత ధ్వజమెత్తారు. ఆమె నివాసంలో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబునాయుడు తిరిగి రాష్ట్రంలో అధికారం చేపట్టాలనే ఆకాంక్షతో తన అనుకూల మీడియాలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై నిత్యం విష ప్రచారాన్ని చేస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 25 శాతమే నెరవేర్చిందని టీడీపీ అర్థంలేని బుక్‌లెట్ వేసిందన్నారు. అబద్ధాల్ని వల్లించే పచ్చ మీడియా పత్రికలో 10 శాతమే రాశారని, మరో పత్రికలో 95 శాతం అమలు చేయలేదని విషపు రాతలు రాశారని పేర్కొన్నారు. గోబెల్స్ ప్రచారంతో చంద్రబాబును తిరిగి ముఖ్యమంత్రిని చేయాలనే ఉద్దేశంతో పనికట్టుకొని ఆ పత్రికలు పని చేస్తున్నాయని ధ్వజమెత్తారు. వాటిలో వచ్చే కథనాల్ని ప్రజలు విశ్వసించరని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పథకాలు ఏ మేరకు అందుతున్నాయో గమనిస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టోలో 98 శాతం అమలు చేస్తే, చూసి ఓర్వలేకనే ఇటువంటి విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక రోజుకో కథనంతో విష ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.


వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎంపిక

నరసరావుపేట: ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా కమిటీ అధ్యక్షులుగా చిలకలూరిపేట డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న పి.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా నరసరావుపేటలో కండక్టర్‌గా పనిచేస్తున్న జి.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. శనివారం డిపో ఆవరణలో నిర్వహించిన ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్పీ రావు హాజరయ్యారు. జిల్లా చైర్మన్‌గా వినుకొండ డిపో కండక్టర్ ఏ.నారాయణరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నరసరావుపేట సూపరింటెండెంట్ జి.రవికుమార్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా వినుకొండ కండక్టర్ పి.సుమన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నరసరావుపేట కండక్టర్ కేవై ఏడుకొండలు, సంయుక్త కార్యదర్శిగా చిలకలూరిపేట డ్రైవర్ డీఎస్ రెడ్డి, కోశాధికారిగా నరసరావుపేట డిపో కండక్టర్ అంకమ్మరావు నియమితులయ్యారు. అనంతరం జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్.వి.శ్రీనివాసరావును కలిసి పరిచయం చేశారు.

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, గుంటూరు జేసీ


వెంకటపాలెంలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి

తాడేపల్లి రూరల్ : ప్రజలు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టి ప్రతి ఒక్కరికీ గ్రామంలోనే సేవలు అందిస్తున్నారని గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, జాయింట్ కలెక్టర్ రాజకుమారి, ఎంటీఎంసీ కమిషనర్ శారదాదేవి, తాడేపల్లి-మంగళగిరి తహసీల్దార్ మత్రిరెడ్డి నాగిరెడ్డి, రామ్‌ప్రసాద్‌లు అర్హులైన వారికి సర్టిఫికెట్లు, రేషన్ కార్డులు, ఇతర ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొలనుకొండలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించే ముందు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు కలసికట్టుగా వారం రోజుల పాటు 1334 నివాసాలకు తిరిగి సర్వే చేశారన్నారు. మొత్తం 361 మంది వివిధ రకాల సర్టిఫికెట్లు కావాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇందులో 341 మందికి పత్రాలు అందజేసినట్లు చెప్పారు. 20 మంది జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు కావాలని దరఖాస్తు చేసుకున్నారని, ఇక్కడ ఇచ్చేందుకు అవకాశం లేదని తెలిపారు. ఆ ప్రాంతంలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే 24 గంటల్లో ఫోన్‌కు మెసేజ్ వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మంగళగిరి నియోజకవర్గ జగనన్న సురక్ష స్పెషల్ ఆఫీసర్ మధుసూదనరావు, సచివాలయ సెక్రటరీ ఎం.ఎల్.వి. ప్రసాద్, తాడేపల్లి రూరల్ జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానంద రెడ్డి, తాడేపల్లి పట్టణ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్ రాజు, కొలనుకొండ కన్వీనర్ వెంకటేశ్వరరావు, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, పార్టీ కన్వీనర్ నూతక్కి శ్రీనివాసరావు, ఎనిగంటి నాగరాజు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హులందరికీ సంక్షేమం

తాడికొండ: జగనన్న సురక్ష పథకం ద్వారా కుల మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమం అందనుందని ప్రభుత్వ సలహాదారు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. జగనన్న సురక్ష పథకం ప్రారంభోత్సవంలో భాగంగా శనివారం వెంకటపాలెంలో కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు, వలంటీర్లు, ప్రజా ప్రతినిధులు ఇంటి వద్దకే వచ్చి సంక్షేమ పథకాలు, వివిధ రకాల సేవలు అందించడం చరిత్రలో ఏ రాష్ట్రంలో జరగని బృహత్తర కార్యక్రమమని తెలిపారు. అనంతరం సురక్ష సేవలకు వచ్చిన దరఖాస్తులు, పరిష్కారం గురించి ఆరా తీశారు. తుళ్లూరు మండలం నెక్కల్లు శిబిరంలో 553 మందికి, వెంకటపాలెంలో 621 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. తాడికొండ మండలం పాములపాడులో 306, లాంలో 461 సర్టిఫికెట్లు అందజేసినట్లు అధికారులు తెలిపారు.

పెదకాకాని వద్ద బైకును ఢీకొన్న కారు

భార్య మృతి.. భర్తకు గాయాలు

పెదకాకాని: ఆసుపత్రిలో బంధువును పరామర్శించి ఇంటికి వెళ్తుండగా, బైకును కారు ఢీకొన్న సంఘటనలో భార్య మృతి చెందగా, భర్త గాయాలైన సంఘటన పెదకాకాని వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయవాడ అజిత్‌సింగ్‌నగర్ వాంబే కాలనీకి చెందిన నందిగం వాణిరెడ్డి, భార్య భారతితో కలసి బైక్‌పై శనివారం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సమీప బంధువును పరామర్శించేందుకు బయలుదేరారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వాణిరెడ్డి బాబాయ్ కలపాల సంతోష్‌ను పరామర్శించి తిరిగి ఇంటికి బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న బైక్ సరీస్ రోడ్డులో పెదకాకాని సెంట్రల్ వేర్ హౌస్ సమీపంలో చేరుకునేసరికి వెనుక నుండి వేగంగా వచ్చిన కారు ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో బైక్‌పై వెనుక కూర్చుని ఉన్న భారతి(36) తలకు బలమైన దెబ్బ తగిలి చెవులు, ముక్కు వెంట రక్తస్రావమై సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. బైక్ నడుపుతున్న నందిగం వాణిరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి పెదకాకాని పోలీసులు చేరుకుని ప్రమాద వివరాలు సేకరించారు. మృతదేహాన్ని గుంటూరు మార్చురీకి తరలించారు. మృతురాలి భర్త వాణిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.